# 100. తిక్కా గంగాధరం

సంకు పాపారావు గారని, ఉండేవారు. ఆయన డిగ్రీ దాకా చదువుకోలేదు గాని మూడేసి నాలుగేసి డిగ్రీలతో ధగధగలాడిపోయిన రచయితలూ నాటకాల ఆర్టిస్టులూ మొదలైన వాళ్లు ఒక రచన గురించిగాని ఒక నాటకం (లేదా నాటిక) గురించి గాని ఆయన ఏమంటారో వినాలని కుతూహలపడే వారు. ఛోటా రాజకీయ నాయకులూ హాబీగా వ్యాపారాలు చేసే బిజినెస్ మాన్లూ కూడా పాపారావుగారి "రిమార్కుల"లో వ్యక్తమయ్యే హాస్య, వ్యంగ్య ధోరణికి ముగ్ధులై ఆయనతో కొంతసమయం (అవసరమైతే ధనం కూడా) "స్పెండ్" చెయ్యడానికి ఇష్టపడేవారు. ఏదైనా సాహిత్య సభకో నాటక ప్రదర్శనకో పాపారావుగారు వస్తున్నారంటే ఆయన చేసే "రన్నింగ్ కామెంటరీ" ని "ఎంజాయ్" చెయ్యడం కోసం చిన్నా పెద్దా తేడా లేకుండా వెనక బెంచీల మీదికి బోలెడుమంది తరలిపోయేవారు. నిర్వాహకులకి ఇష్టం ఉన్నా లేకపోయినా వెనక బెంచీల్లో చేరి కామెంట్లు చేసేవాళ్లు సాహిత్య సభల్లోనూ నాటక ప్రదర్శనల్లోనూ తప్పని సరిగా ఉంటారు కద. పాపారావు గారి కామెంట్లు అతని చుట్టూ చేరి వినే వాళ్లని ఎంత ఆహ్లాద పరచేవో నిర్వాహకుల్నికూడా అంతగా అలరించ గలిగినవి కావడం ప్రత్యేకత. "కాకలు తీరిన" రాజకీయ నాయకులైనా సరే, పాపారావు గారు వాళ్లమీద వేసిన మాట విసురికి "బలే అన్నాడులే" అని ఆనందించవలిసిందే తప్పా మర్నాడు ఇద్దరు 'జూనియర్లని' పంపించి తన్నించ వలసిన అవసరం రాదు.

పబ్లిక్‌షో సందర్భంగా వెనక బెంచీల్లో ఉండి మాటవిసురు వెయ్యడం సంగతి చెప్పుకునేటప్పుడు పాపారావు గారు ఒకనాడు ఒక సినిమాహాల్లో అరిచిన అరుపు సంగతి చెప్పుకో వలసిందే. అప్పట్లో టీ.వీ లేదు. కాని వ్యాపార ప్రకటనలు వీడియోలో తీసి ప్రదర్శించడం ఉంది. ఆ రోజు ఒకానొక వ్యాపార ప్రకటనలో ఒక "నిత్యావసర మాత్ర" గురించి చెపుతూ ఆ మాత్ర "ఇప్పుడు పరమాణువుల సైజుకి పిండికొట్టి తయారు చెయ్యబడుతున్నది" అని చెప్పేరు. పాపారావు గారు "అమ్మ - కొడకా; ఇన్నాళ్ళూ చెయ్యలేదన్నమాట!?" అని అరిస్తే హాల్లో ఉన్న వెయ్యిమందీ నవ్వీ ఈలలువేసీ స్పందించడం చాలామందికి గుర్తుంది.

పాపారావంత వచోనైశిత్యం లేకపోయినా గంగాధరం అనే ఒక ఇంజినీరింగు విద్యార్థి ఆ పద్ధతిలోనే సభల్లోనూ ప్రదర్శనల్లోనూ కామెంట్లు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఈ అబ్బాయి ఒకసారి ఒక నాటక ప్రదర్శనకి ప్రేక్షకుడుగా వెళ్లాడు. నాటకంలో హీరోయిన్ ఒకానొక సీరియస్ సన్నివేశంలో "నా చిన్నతనంలోనే నా తల్లిదండ్రులిద్దరూ గతించారు" అన్నది. గంగాధరం వెంటనే "ఓసి దౌర్భాగ్యురాలా!" అని అరిచాడు. అంతవరకూ హీరోయిన్ అపరిపక్వ నటనకి విసుక్కుంటున్న ప్రేక్షకులందరూ ఎంతో రిలీఫ్ పొంది గొల్లుమని నవ్వేరు.

ఒకసారి ఒక ఉపన్యాస శిరోమణిగారు మాట్లాడుతూ : "మొన్నీ మధ్య నేను కలకత్తా వెళ్లేను. ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడప్పుడు కరెంటు పోతూ వుందని మనం ఎంతో విసుక్కుంటామా! వెస్ట్ బెంగాల్‌లో అప్పుడప్పుడు కరెంటు వస్తూ ఉంటుందని సంతోషించే స్థాయిలో ఉంది పరిస్థితి. నేను బసచేసిన వాళ్లింట్లో ఈ సంగతి ముచ్చటించుకునేటప్పుడు - కలకత్తాలో ఛటర్జీలూ, బెనర్జీలూ, ముఖర్జీలూ పుష్కలంగా వున్నారుగాని ఎనర్జీయే లేదన్నాను." అని ప్రేక్షకుల చప్పట్లకోసం ఆగాడు. గంగాధరం వెంటనే "అందుకే మీరంటే మాకు ఎలర్జీ" అని అరిచాడు. వక్త ఆశించిన హర్షధ్వానాలు

అప్పుడు రూఢిగా వచ్చాయి.

"ఎందుకయ్యా, మీటింగుల్లో నువ్వు ఇలా అల్లరిచేస్తావు? నీకిష్టం లేకపోతే మీటింగ్స్‌కి రావడం మానెయ్యాలి గాని అల్లరి చెయ్యడం ఎందుకూ?'' అని నేను గంగాధరాన్ని కూకలెయ్యబోయాను.

"అల్లరి మాలాంటి కుర్రాళ్లు చెయ్యకపోతే మీలాంటి పెద్దవాళ్లు చేస్తారా?'' అన్నాడు గంగాధరం. అని వూరుకోలేదు. "మిస్చీఫ్ ఈజ్ ద గేమ్ ఆఫ్ ద ఇంటెలిజెంట్ లాట్'' (తెలివి తక్కువ దద్దమ్మలు అల్లరి చెయ్యలేరు) అని ఒక రిమార్కు విసిరాడు.

గంగాధరం ముఖ్యంగా సాహిత్య సంబంధమైన మీటింగులకి తప్పనిసరిగా వచ్చేవాడు. కవితా పఠనాలూ, పండిత సన్మానాలూ, పుస్తకావిష్కరణలూ ఏవో ఒకటి రోజూ ఎక్కడో ఓ దగ్గిర జరుగుతూనే ఉండేటంత భౌగోళిక వైశాల్యం వుంది మా వూరికి (హృదయ వైశాల్యం లేదనేగా, మీ ఉద్దేశం? - అనేస్తాడు గంగాధరం వెంటనే) అయితే, అలా జరిగే సభలను గురించి ఎంగేజిమెంట్స్ కోలమ్‌లో పత్రికలు ప్రచురించే మూడు ముక్కలు ("సా॥ 6 గం. వరదయ్య హాలులో జనసాహితి కవిసమ్మేళనం") చూసి ఆ వేళకి అక్కడికి చేరిపోడం గంగాధరానికి అలవాటు. అక్కడ అల్లరి చెయ్యడం అలవాటు ఉండనే వుంది కదా.

మొన్న నాలుగో తారీకునాడు బలరాందాసు గారు ఏర్పాటు చేసిన ఒక సభ. పంచముఖేశ్వర రావుగారని, పాతికేళ్ల క్రితం ఈ వూళ్లో లెక్చరర్‌గా వుండేవారు. వేరే ఊళ్లో ఉన్న యూనివర్శిటీకి లెక్చరర్‌గా వెళ్లారు. రీడరై, ప్రొఫెసరై, అధ్యయిజరై, ఎన్నెన్నో విద్యాసంస్థల్లో పనిచేసి చివరికి ఒకచోట వైస్ ఛాన్సెలర్‌గా తేలారు. ఆయన ఇక్కడ ఒక సభలో మాట్లాడ్డానికి వస్తున్నారని తెలిసి బలరాం దాసుగారు ఆయనకి ఒక సన్మానం ఏర్పాటు చేసి ఆయన్ని ఇక్కడ ఇంకోరోజు ఉంచేశారు. నాకు ఆహ్వానం రాగానే బలరాందాసు గారికి ఫోన్ చేసి "ఈ సభకి గంగాధరం ఒచ్చి అల్లరి చెయ్యకుండా ఏమైనా చేస్తే బాగుంటుంది. లేకపోతే మన వూరి మీద పంచ ముఖేశ్వరరావుగారికి ఉన్న గౌరవం కాస్తా పోతుంది'' అని చెప్పేను. "మనమేం చేస్తాం? అంతా ఎలా జరగాలో అలా జరుగుతుంది.'' అన్నారాయన.

మీటింగు ప్రారంభంలో అధ్యక్షులను, ముఖ్య అతిథిని, వక్తలను బలరాందాసు గారే వేదిక మీదకు ఆహ్వానించారు. ఇన్విటేషను కార్డులో పేర్కొన్న వారందరూ వేదికని అలంకరించాక "మన నగరంలో ఏ కళారంగానికి సంబంధించిన సభ జరిగినా తప్పనిసరిగా హాజరయ్యే కళాపిపాసి చిరంజీవి గంగాధరం పంచముఖేశ్వరరావుగారికి ఢిల్లీ యూనివర్శిటీలో శిష్యుడు. ఆయన కూడా వేదిక మీదకు రావాలి.'' అన్నారు బలరాందాసుగారు.

మొత్తం పదకొండుమంది మాట్లాడారు. సభ మూడుగంటలపాటు సాగింది. గంగాధరం కిక్కురు మనకుండా స్టేజిమీద కూర్చున్నాడు, తనకి నిర్వాహకులు అందజేసిన "బొకే'' లో ఉన్న పువ్వుల రేకలు మొత్తం ఒలిచి కింద పోశాడు. తన కెదురుగా ఉన్న గ్లాసులోవి కాక మరో నలుగురి కోసం పెట్టిన మంచినీళ్లు తాగేశాడు. అందరూ మాట్లాడ్డం అయ్యాక అతని ఛాన్స్ వచ్చింది. "నాకు చదువు చెప్పిన పంచముఖేశ్వరరావు గారు అనేకమందిలో ఒకరు. కాని, నాకు బుద్ధి చెప్పిన బలరాందాసుగారు ఒక్కరంటే ఒక్కరు. వారికి నా జోహార్లు. నన్ను స్టేజిమీదికి ఆహ్వానించమని బలరాందాసు గారికి సలహా చెప్పిన వారికి కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలు'' అని గంగాధరం నావేపు గుర్రుగా చూసేడు.

★